క్లుప్తంగా

రేపు ఉచిత వైద్య శిబిరం

రఘునాథపల్లి : మండలంలోని కంచనపల్లి ప్రాథమిక పాఠశాలలో మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 3న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కందుకూరి ప్రభాకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో మోకాళ్ల, నడుము నొప్పులకు మందులు, అవసరమగు వారికి రక్త పరీక్షలు, సీటిస్కాన్, ఎమ్మారై స్కానింగ్‌లు చేసి ఉచితంగా శస్త్రచికిత్స, మందులు అందిస్తామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామస్తులతో పాటు, ఇతర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

500 మందికి ఉచిత పరీక్షలు


వైద్యశిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లు

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో దాదాపు 500 మందికి పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే పండ్లు కూడా పంపిణీ చేశారని తెలిపారు. క్లబ్ కార్యవర్గ సభ్యులు గంగం సతీష్‌రెడ్డి, ఈదులకంటి ప్రతాప్‌రెడ్డి, చల్ల శ్రీనివాస్‌రెడ్డి, రామిని మదన్‌మోహన్, మూసిని రాజు, మల్లవరం వెంకటేశ్వర్లు రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, మేకల రంగారెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి ఉత్సవాలు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని శివునిపల్లిలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మతల్లి, రేణుకా ఎల్లమ్మ తల్లి 13వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ కులపెద్దలు, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం బాధ్యులు, పెద్దమ్మతల్లి దేవాలయ కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో ఘనంగా పూజలు చేపట్టారు. ముందుగా పెద్దమ్మతల్లికి, రేణుకా ఎల్లమ్మతల్లికి అభిషేక పూజలు చేపట్టారు. సాయంత్రం డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



పాలకుర్తి : మండలంలోని విస్నూరులో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన శతాధిక గ్రంథాలను ఇంటింటికి పరిచయం చేస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక భువనగిరి, జనగామ, చేర్యాల, తొర్రూరు కమిటీ సభ్యులు దేవేంద్ర, శంకర్, రాము, లింగస్వామి , భాస్కర్, బుచ్చిబాబు, రామకృష్ణ, అశోక్, నితిన్, కవిత, లలిత, మంజుల, మాధవి, లావణ్య, శ్రీరామ్, సాయిరాజు పాల్గొన్నారు.


సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

జఫర్‌గఢ్ : నర్మెటలో జూన్ 3, 4వ తేదీల్లో జరగనున్న సీపీఐ నాలుగో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి జువారి రమేష్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సీపీఐ నిర్వహించిన ప్రజా పోరాటాల పార్టీ జిల్లా మహాసభలు సమీక్షించడంతో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. మహాసభకు ముఖ్య అతిథులుగా చాడ వెంకటరెడ్డి తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ మహాసభలకు పార్టీ ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు పెండ్యాల సమ్మయ్య, ఎండి యాకుబ్‌పాషా గట్టుమాళ్ల, ఎండీ జాఫర్, అజయ్, రడపాక సత్యం పాల్గొన్నారు.

4న జిల్లాస్థాయి షటిల్, బ్యాడ్మింటన్ ఎంపికలు

జనగామ రూరల్: జిల్లా స్థాయి షటిల్, బ్యాడ్మింటన్ ఎంపికలు ధర్మకంచలోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపగోని సుగుణాకర్, కార్యదర్శి కైరిక హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 13, 15, 17, 19 వయసు గల బాలబాలికలకు సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9951999512 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

సాగుకు నీరందేనా ?


బొమ్మకూర్‌లోని ఓపెన్ కెనాల్


హన్మంతాపురంలోని కెనాల్


నర్మెటలో ఓపెన్ కెనాల్

- కాల్వల్లో మొలచిన పిచ్చిమొక్కలు
- నిలిచిన నీటి ప్రవాహం
- చెరువులు కుంటలను నింపేందుకు ఓపెన్ కెనాల్స్
- సాగునీటికి రైతుల ఇక్కట్లు

నర్మెట : తెలంగాణాలో మరెక్కడా లేని విధంగా మండలంలో నాలుగు రిజర్వాయర్లు ఉన్నాయి. బొమ్మకూర్ రిజర్వాయర్ 0.19 టీఎంసీల సామర్థ్యం, కుడికాల్వ ద్వారా 21 వేలు, ఎడమ కాల్వ ద్వారా 9 వేల ఎకరాల ఆయకట్టు, వెల్దండ రిజర్వాయర్ సామర్థ్యం 0.15 టీఎంసీలు ఆయకట్టు 12.5 వేల ఎకరాలు, కన్నెబోయినగూడెం రిజర్వాయర్ 0.12 టీఎంసీలు, ఆయకట్టు 9 వేల ఎకరాలు, మల్లన్నగండి 0.40 టీఎంసీలు, ఆయకట్టు కుడి కాల్వ ద్వారా 5600, ఎడమకాల్వ ద్వారా 4 వేల ఎకరాల ఆయకట్టు, చెరువు, కుంటలకు నీరందించేందుకు ఓపెన్ కెనాల్స్ నిర్మాణం చేపట్టారు. వీటి ద్వారా మండలంతో పాటు జనగామ, తరిగొప్పుల, రఘునాథపల్లి, స్టేషన్ ఘన్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరు చేరుతుంది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నచందంగా సాగు నీరందించే ఓపెన్ కెనాల్స్ నిర్వాహణ లోపంతో తుంగ, పిచ్చిమొక్కలు, గడ్డితో నిండిపోయి సాగుకు నీరందించలేని పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిస్తే చెత్త తొగించడం ఇబ్బందికరంగా ఉంటుందని, ఖరీఫ్ సాగు ఇబ్బంది కలుగుతుందని ఉపాధి హామీలోనైనా పిచ్చిమొక్కలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

చెత్త తొలగిస్తేనే సాగు నీరు



ఏడాదికాలంగా ఓపెన్ కెనాల్లో పిచ్చిమొక్కలు పెరిగి నీటి ప్రవాహం నిలిచి పోయింది. చెరువు కుంటల్లోకి నీరు సకాలంలో చేరడం లేదు. పంటల సాగు ఇబ్బందికరంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి కాల్వల్లోని చెత్తను తొలగించాలి.

– గుడికందుల నరహరి, రైతు హన్మంతాపురం

ఇంత నిర్లక్ష్యమైతే ఎలా..



రిజర్వాయర్లు కట్టారు, కాల్వలు తీశారు. సాగుకు నీరు రాక పోతే ఏం లాభం..ఎన్నిసార్లు అడిగినా ఎవరూ పట్టించుకోవడం లేదు. వర్షాకాలం వచ్చింది. కాల్వలో చెట్లు, తుంగ తదితర మొక్కలు పెరిగి నీటి ప్రవాహం రాకుండా అడ్డుకుంటున్నాయి.

– ప్రజ్ఞాపురం శ్రీను, రైతు నర్మెట

ప్రణాళిక సిద్ధం చేశాం..



ఓపెన్ కెనాల్స్‌లో చెత్తను తొగించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఎన్ఆర్ఈజీఎస్ అధికారులతో చర్చించాల్సిందిగా డీఈకి తెలిపాను. జనగామలో నేడు (సోమవారం) నిర్వహించనున్న సమావేశంలో తగిన నిర్ణయం తీసుకుంటాం.

– మంగీలాల్, ఈఈ ఇరిగేషన్, జనగామ

నేడు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

పాలకుర్తి టౌన్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో నేడు (సోమవారం) మధ్యాహ్నం 1:30 నిమిషాలకు తెలంగాణ రాష్ట్రంలోని రెండో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి ఆవిష్కరించనున్నారు.

సచివాలయం టు పాలకుర్తి

మొదటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని హైదరాబాద్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే రెండో తెలంగాణ తల్లి విగ్రహం పాలకుర్తిలో ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి తెలిపారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం నడుస్తోందన్నారు. విగ్రహావిష్కరణకు పాలకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


మంత్రి ఆవిష్కరించనున్న తెలంగాణ తల్లి విగ్రహం

ఉత్సాహంగా క్రీడాపోటీలు

జనగామ రూరల్ : తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉద్యోగులకు, పాత్రికేయులకు క్రీడా పోటీలను ఆదివారం పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహించారు. పోటీల్లో మీడియా, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, పంచాయతీ రాజ్, విద్యుత్, మున్సిపల్, వ్యవసాయ, వైద్య, ఆరోగ్య శాఖల ఉద్యోగులు క్రికెట్, షాట్ పుట్, బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్, మ్యూ జికల్ చైర్, లెమన్ స్పూన్ క్రీడల్లో ఉద్యోగస్తులు, పాత్రికేయులు పాల్గొన్నారు. విజేతలకు జూన్ 2న బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ముదిరాజ్‌లు ఐక్యత చాటాలి


ఎలేందర్‌ను సత్కరిస్తున్న నాయకులు

రఘునాథపల్లి : ముదిరాజ్ కులస్తులు ఐక్యతగా ముందుకు సాగాలని మండలంలోని ఫతేషాపూర్ ముదిరాజ్ నూతన పెద్ద మనిషి శివార్ల ఎలేందర్ అన్నారు. నూతనంగా ఎన్నికైన ఎలేందర్‌ను ఆదివారం గ్రామంలో చెరువు కాంట్రాక్టర్ అక్కినపల్లి మాధవి మల్లేష్ సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో చెరువు సంఘం అధ్యక్షుడు చింత కాయల సుధాకర్, శివార్ల జనార్దన్, పెండెల మల్లయ్య, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గాజులపాటి వీరోజి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు యామంకి కృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు హేయనీయం

కొడకండ్ల : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరిట నిర్బంధాన్ని కొనసాగిస్తూ అక్రమ అరెస్టులు చేయడం హేయనీయమని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ అన్నారు. మండల బీఆర్ఎస్ నాయకులు పేరం రాము, అభిమన్‌గాంధీ, వెంకటనారాయణ, సతీష్‌గౌడ్ తదితరులను ఆదివారం ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా రామోజీ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా కాంగ్రెస్ విఫలమైందని, ప్రశ్నించే గొంతులను అణచివేత దోరణిని అవలంభిస్తుందన్నారు. పాలకుర్తిలో బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గుండాలు దాడులు చేయడం సిగ్గు చేటని, ఇలాంటి వాటికి తాము భయపడేది లేదన్నారు. కార్యక్రమంలో హరీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు

ధర్నాలను జయప్రదం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సోమయ్య

చిల్పూరు : రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ధర్నాలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య పిలుపునిచ్చారు. మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామంలో ఆదివారం సంఘం మండల అధ్యక్షుడు గద్ద కుమార్ ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ పంట రుణాల సాధనకై ఈనెల 5,6 తేదీల్లో బ్యాంకుల ఎదుట, సమస్యల పరిష్కారానికై ఈనెల 11న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నాలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నారబోయిన భిక్షపతి, సాదం రామరాజు, జక్కుల యాదగిరి, గణేష్ పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం


విరాళాన్ని అందజేస్తున్న సామాజికవేత్త వేణు

బచ్చన్నపేట : మండలంలోని తమ్మడపల్లికి చెందిన సామాజిక వేత్త అమురవేణు సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలోని మల్లికార్జునస్వామి ఆలయానికి విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్న స్వామి కోరిన భక్తుల కొంగు బంగారంలా నిలుస్తూ నిత్యం వేల మంది పూజలు, సేవలను అందుకుంటున్నారని అన్నారు. ఆలయంలో సకుటుంబ సమేతంగా ప్రతి సంవత్సరం ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నానని అందులో భాగంగానే ఆలయ అభివృద్ధికి రూ. 1,00,116లను విరాళంగా అందించానని తెలిపారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు అనసూయ–రాజయ్య, ఆలయ కార్యనిర్వాహణాధికారి అన్నపూర్ణ, బుద్ది శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మల్లికార్జున్, నాయకులు పద్మ అజయ్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

3న వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

జనగామ రూరల్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాలోని 8 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థుల కోసం జూన్ 3న వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తుందని బాలిక సంరక్షణాధికారి గౌసియా బేగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు గూగుల్ ఫారాన్ని పూరించాలన్నారు. మొత్తం 50 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారని వ్యాసరచన 25, చిత్రలేఖనంలో 25 మంది పాల్గొంటారన్నారు. సోమవారం మధ్యాహ్నం 1 గంట లోపు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. మరింత సమాచారం కోసం నవీన్ 96666 81335 అనిల్ 90102 53151 సంప్రదించాలన్నారు.

అనుమతుల మేరకు ఫ్లెక్సీలు పెట్టుకోవాలి

దేవరుప్పుల : ప్రజావసరాల స్థలాల్లో ఎవరికి ఇబ్బందులు జరగకుండా రాజకీయ పార్టీలు తగిన అనుమతుల మేరకు మాత్రమే ఫ్లెక్సీలు పెట్టుకోవాలని ఎంపీడీఓ కె లక్ష్మీనారాయణ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారిలో కొన్ని రోజులుగా శాశ్వత ప్రాతిపదికన పెట్టిన పలు పార్టీల ఫ్లెక్సీలను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీలైన ఆయా జీపీ నిబంధనల మేరకు సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు.

పుష్పాలంకరణలో వేంకటేశ్వరస్వామి

చిల్పూరు : బుగులు వేంకటేశ్వరస్వామి ఆదివారం ఉదయం నుంచి పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

సమన్వయంతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెద్దాం

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉప్పల సురేశ్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్‌బాబు

దేవరుప్పుల : పార్టీలో కొనసాగుతున్న శ్రేణులు తారతమ్యాలను పక్కనబెట్టి సమన్వయంతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెద్దామనీ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉప్పల సురేశ్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పుల ఉప్పలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామ యూత్ అధ్యక్షుడిగా ఆకుల సంతోష్‌తో పాటు పార్టీ సమన్వయ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో సరైన క్యాడర్ ఉన్నప్పటికీ మనలో నెలకొన్న అనైక్యతను ప్రతిపక్షాలు ఆసరా చేసుకొని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో పార్టీలో చిన్నచిన్న అంతర్గత బేధాలను అధిగవిస్తూ పార్టీ శ్రేయస్సు కోసం పాటుపడితే పార్టీతోపాటు దగాపడిన క్యాడర్‌కు తప్పక భవిష్యత్ ఉంటుందని సూచించారు. సమావేశంలో పాల ఉత్పత్తిదారుల (డెయిరీ) సంఘం జిల్లా అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి టి.పాండు కృష్ణ, మండల నాయకులు రెడ్డిరాజుల రమేష్, బోనగిరి యాకస్వామి, ఉప్పుల యాదగిరి, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు పులిగిళ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి రెవెన్యూ సదస్సులు

బచ్చన్నపేట : భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న రెవెన్యూ సదస్సులను ఆయా గ్రామాల రైతులు వినియోగించుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఫణికిషోర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 23 రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ గ్రామంలో సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు సంబంధిత పత్రాలతో ఈ సదస్సుకు హాజరై నిర్దేశిత నమూనాలో ఆర్జీని నింపడానికి తమ సిబ్బంది సహాయ పడుతారని, పూర్తి చేసిన ఆర్జీని ఈ సదస్సులో అందజేయాలన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు ఈ సదస్సులను వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామాల వారిగా ఈ నెల 3న బసిరెడ్డిపల్లి, 4న బండనాగారం, సాల్వాపూర్, 5న కేసిరెడ్డిపల్లి, మన్‌సాన్‌పల్లి, 6న కొన్నె, 9న తమ్మడపల్లి, లింగంపల్లి, 10న పోచన్నపేట, దబ్బగుంటపల్లి, 11న చిన్నరామన్‌చర్ల, 12న నారాయణపురం, పుల్లగూడ, 13న పడమటికేశ్వాపూర్, నాగిరెడ్డిపల్లి, 16న కట్కూర్, గంగాపూర్, 17న ఆలింపూర్, 18న బచ్చన్నపేట, 19న లక్ష్మాపూర్, 20న కొడవటూర్ గ్రామాల్లో సదస్సులు ఉంటాయన్నారు. తహసీల్దార్ ఫణికిషోర్, సీనియర్ అసిస్టెంట్ రాకేష్, ఆర్ఐ వంశీకృష్ణ, సర్వేయర్ నర్మద, జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్, రాజపోచయ్య ఒక టీం, నయాబ్ తహసీల్దార్ స్రవంతి, ఎంపీఎస్ఓ నాగరాజు, ఏఆర్ఐ మున్వర్, జూనియర్ అసిస్టెంట్ యాకన్న, రికార్డు అసిస్టెంట్లు రజిత, గంగాస్వప్న మరో టీంగా వెళ్లి గ్రామ సదస్సుల్లో ఆర్జీలను స్వీకరిస్తారని తెలిపారు.

కొనసాగుతున్న రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని తాటికొండ గ్రామంలో మాదిగ కులస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీరేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. గ్రామ మాదిగ కులపెద్దలు, దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి ధాన్యాదివాసం, హోమం పూజలను చేపట్టారు. వేదపండితులు జీడికంటి వరుణాచార్యులు, శ్రీహరి ఆచార్యులు ఆధ్వర్యంలో ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, మధ్యాహ్నం అమ్మవారి విగ్రహానికి ధాన్యాదివాసం, హోమం తదితర పూజలను ఘనంగా చేపట్టారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన విగ్రహ ప్రతిష్ఠాపన ఈనెల 2న, అమ్మవారి కల్యాణం, బోనాల పండుగ 3న నిర్వహిస్తారని దేవాలయ కమిటీ బాధ్యులు తెలిపారు. ఉత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపను పొందాలని వారు కోరారు.


అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

వారసత్వపు సర్కస్ పాట్లు

దేవరుప్పుల : జీవనోపాధి కోసం పలు రంగాల్లో మార్పులు జరుగుతున్నా కొన్ని సామాజిక వృత్తుల వారసత్వపు విధానాలను విస్మరించలేక సర్కస్ పాట్లు పడుతున్న దృశ్యం అద్దం పడుతోంది. ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని బస్‌స్టేజీ కాలనీలో జనగామకు చెందిన ఏనుగుల రమేష్–శాంత దంపతులు తమ చిన్నారులచే పలు విన్యాసాలు చేయిస్తున్నారు. విశ్వాసంతో సాహసం చేసే విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.


దేవరుప్పులలో సర్కస్ చేస్తున్న దృశ్యం

డీసీఎం బోల్తా

జఫర్‌గఢ్ : మామిడికాయల ట్రే డబ్బాలతో వెళ్తున్న డీసీఎం అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన మండలంలోని రేగడితండా శివారు కేజీ తండా వద్ద ఆదివారం చోటుచేసుకుంది. తండావాసులు కథనం ప్రకారం.. మామిడికాయలకు సంబంధించిన ఖాళీ ట్రేల డబ్బాలతో డీసీఎం జఫర్‌గఢ్ నుంచి స్టేషన్ ఘన్‌పూర్ వైపు వస్తుంది. కేజీ తండా సమీపాన మలుపు వద్ద అదుపుతప్పి డీసీఎం బోల్తా పడింది. డ్రైవర్ సల్ప గాయాలతో బయటపడడంతో ప్రాణా ప్రాయం తప్పింది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పాలకుర్తి టౌన్ : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


స్టేషన్‌ఘన్‌పూర్ : ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, గురువులు

పాలకుర్తి టౌన్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997– 98 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరపుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువులను, సహచర విద్యార్థుల మృతులకు సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. 28 ఏళ్ల తర్వాత కలిసిన సహచరుల ఆత్మీయతతో ఆలింగనం చేసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. నాటి గురువులను శాలువతో ఘనంగా సన్మానించి మెమొంటోలు అందజేశారు.ముఖ్యఅతిథిగా మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ పాఠశాలలో

స్టేషన్‌ఘన్‌పూర్ : డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదవుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 21 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాల వేదికగా కలుసుకున్న బాల్య స్నేహితులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ బాల్యస్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యాబుద్దులు నేర్పిన గురువులను సన్మానించారు. ప్రిన్సిపాల్ కృతమూర్తి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


ఎల్ఓసీ అందజేస్తున్న కిరణ్‌కుమార్ గౌడ్

బచ్చన్నపేట : పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆది వారం మండల కేంద్రానికి చెందిన రాపెల్లి నాగలక్ష్మి బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా ఆస్పత్రి ఖర్చులకు గాను రూ.2.50 లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించి అందజేశారు. నాయకులు నల్లగోని బాలకిషన్‌గౌడ్, బుచ్చిరాజు, సిద్ధయ్యగౌడ్, మహేందర్‌రెడ్డి, వెంకటేశం, ఎల్లారెడ్డి, శ్రీకాంత్, సదానందం, శాంతయ్య, సుధాకర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రామచంద్రం, సాయిలు, సిద్దులు, శ్రీనివాస్, వెంకటేష రామకృష్ణ, భగవాన్ పాల్గొన్నారు.